
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
శుక్రవారం 26 జనవరి 2024



కడుపు నింపిన కళను బతికిస్తూ..



- 50 ఏళ్లుగా చిందు యక్షగాన ప్రదర్శనల్లో మేటిగా గద్దం సమ్మయ్య
- ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపిక
- వెక్కిరింపులను దిగమింగుకుంటూ కళామతల్లి సేవలో తరింపు

జనగామ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వారసత్వంగా వచ్చిన కళనే ఆయన నమ్ముకున్నారు. చిన్న తనంలో తండ్రి వెంట నడిచి కడుపు నింపే చిందు యక్షగాన కళామ తల్లి ఒడిలో ఆయన ఒదిగిపోయారు. 16 ఏళ్ల ప్రాయంలోనే వేదికలు ఎక్కి రామాయణ, మహాభారత, భాగవతం, జాంబవ పురాణ కథలను అవలీలగా ప్రదర్శన ఇవ్వడం ప్రారంభించారు. కులవృత్తిగా భావించో, కడుపు నింపుకోవడం కోసమో కాకుండా అంతరించిపోతున్న కళను కాపాడాలనే సంకల్పాన్ని ఆయన తన 16 ఏటనే తీసుకున్నారు. 50 ఏళ్లుగా చిందు యక్షగాన కళన బతికిస్తూ భావితరాలకు అందిస్తున్న జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి చెందిన గద్దం సమ్మయ్యను 'పద్మశ్రీ' పురస్కారం వరించింది. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పద్మశ్రీ పురస్కారాల జాబితాలో సమ్మయ్యకు చోటు దక్కింది.



భీముడి వేషధారణలో గద్దం సమ్మయ్య

ఐదు దశాబ్దాలుగా చిందు యక్షగాన కళను బతికిస్తున్న జనగామ జిల్లాకు చెందిన గద్దం సమ్మయ్యను 'పద్మశ్రీ' పురస్కారం వరించింది. కళల విభాగంలో ఆయన అందించిన సేవలకు గాను 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన గడ్డయ్య సమ్మయ్య పేద కుటుంబంలో జన్మించారు. అంతరించిపోతున్న చిందు యక్షగాన కళను బతికిస్తూ జాతీయ స్థాయిలో పుట్టిన గడ్డకు గద్దం సమ్మయ్య పేరు తెచ్చారు. పాలకుర్తి మండలం వల్మిడిలో గద్దం(చిందుల) రామస్వామి, చండిగాంబ దంపతులకు సమ్మయ్య 1958లో జన్మించారు. ఆ తర్వాత రామస్వామి దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లిలో స్థిరపడ్డారు. ఆరో తరగతి వరకు చదువుకున్న సమ్మయ్య తల్లిదండ్రులతో పాటు తమ కులవృత్తి అయిన చిందు యక్షగాన ప్రదర్శనల్లో పాల్గొనేవారు. 16 ఏళ్ల వయసులో తొలిసారిగా తండ్రితో కలిసి చిన్ని కృష్ణుడి వేషధారణలో కళారంగ ప్రవేశం చేశారు. జాంబవ పురాణం, భాగవతం, రామాయణం వంటి కథలను ప్రదర్శనల రూపంలో చెప్పడమే చిందు యక్షగానం. చిన్ననాటి నుంచి ఈ కళపై మక్కువతో 5 దశాబ్దాలుగా దాదాపుగా 19 వేల ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. సమ్మయ్య లోహితాంకుడు, ప్రహ్లాదుడు, సిరియాలుడు, బాలవద్దిరాజు పాత్రల్లో ఎక్కువగా ప్రదర్శనలు ఇచ్చేవారు. అంతేకాకుండా సత్య హరిశ్చంద్ర, కీచక, కంసుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, దుర్యోధనుడు, రావణబ్రహ్మ పాత్రల్లో అద్భుతంగా ఒదిగిపోతారు. గద్దం సమ్మయ్యకు వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన ముత్తిలింగం కుమార్తె శ్రీరంజనితో 1983లో వివాహం జరిగింది. సమ్మయ్యకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. పెద్దకుమారుడు సోమరాజు చిందు కళలోనే ఉన్నారు.

వెక్కిరింపులనే మెట్లుగా చేసుకొని..

చిందు యక్షగాన కళా విభాగంలో పద్మశ్రీ పురస్కారం పొందిన సమ్మయ్య ముందు నుంచీ అనేక అవమానాలు, వెక్కిరింపులను ఎదుర్కొన్నారు. చిన్న వయస్సులో వేదికలు ఎక్కి ప్రదర్శనలు ఇవ్వడం, స్త్రీ పాత్రల్లో నటించడం కారణంగా ఒత్తుగా జుట్టు పెంచుకోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో పలు చోట్లకు వెళ్లినప్పుడు అవమానాలు ఎదురైన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ నమ్ముకున్న కళను బతికిస్తూ ఆసక్తి ఉన్న యువకులకు శిక్షణ ఇస్తూ ఆయన జాతీయస్థాయిలో ఎదిగారు.

2017లోనే 'పద్మశ్రీ' ప్రతిపాదిత జాబితాలో చోటు

జనగామ జిల్లాకు చెందిన గద్దం సమ్మయ్యకు 2017 లోనే పద్మశ్రీ పురస్కారం చేజారింది. అప్పట్లో రాష్ట్రం నుంచి పద్మశ్రీ పురస్కారాలకు తెలంగాణ నుంచి 47 మంది పేర్లను కేంద్రానికి పంపగా అందులో సమ్మయ్య పేరు ఉంది. కానీ.. అప్పట్లో చేజారిన పురస్కారం ఇప్పుడు వరించింది.

ప్రదర్శనలు, సన్మానాలు, పురస్కారాలు

1985లో జనగామ మునిసిపల్ కార్యాలయంలో తెలుగు విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో ఒగ్గుకథ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహాభారతంలోని 'కీచక వధ' అనే పౌరాణిక ఘట్టాన్ని అద్భుతంగా ప్రదర్శించగా అప్పటి మంత్రుల చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు.

◆ 1998లో నెహ్రూ యువకేంద్రం ద్వారా కళా ప్రదర్శనలు ఇచ్చే అవకాశం లభించింది. ◆ 9 మంది బృందంతో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చారు. 1991లో ఆలిండియా రేడియోలో 80 ప్రదర్శనలు, దూరదర్శన్‌లో 90 ప్రదర్శనలిచ్చారు. ◆ సాంస్కృతిక, పర్యాటక శాఖలో సుమారు 4000 ప్రదర్శనలు ఇవ్వడమే కాకుండా ఢిల్లీ, ఒడిషా, మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోనూ అనేక ప్రదర్శనలు ఇచ్చారు. కాగా.. సమ్మయ్య సేవలకు గాను 2009లో ఆయన 'కళారత్న' బిరుదును అందుకున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ఓటరు దినోత్సవంలో కలెక్టర్ శివలింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ పట్టణంలోని ఎస్ఎంఆర్ గార్డెన్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 జనవరి 25న ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటైన సందర్భంగా ఆ తేదీని ఓటరు దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎన్నికలు ఎలా నిర్వహించాలో భారత ఎన్నికల కమిషన్ మార్గనిర్దేశం చేయడం గొప్ప విషయమన్నారు. ఇటీవల తెలంగాణలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 85 శాతం ఓటు నమోదైందన్నారు. రాబోయే ఎన్నికల్లో మరింత ఎక్కువ శాతం పోలింగ్ జరిగేందుకు ఓటర్లు సహకరించాలని అన్నారు.

ఆకట్టుకున్న నాటికలు..

ఓటరు దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఓటు హక్కుపై ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలపై విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్లను సన్మానించారు. అంతకుముందు అధికారులు ఆర్టీసీ చౌరస్తా నుంచి ఎస్ఎంఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు పర్మర్ పింకేశ్, రోహిత్‌సింగ్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, ఆర్డీవో మురళీకృష్ణ, డీఈవో రాము, డీఐఈవో శ్రీనివాస్, ఏవో రవీందర్ డీడబ్ల్యూవో జె.జయంతి, సాధిక్ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి

◆ డీఆర్డీవో ఏపీడీ చంద్రశేఖర్ ◆ పలు గ్రామాల్లో నర్సరీల సందర్శన

చిలుపూర్, జనవరి 25 : మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో చేపడుతున్న మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీ చంద్రశేఖర్ అన్నారు. గురువారం పల్లగుట్ట, చిన్నపెండ్యాల, దేశాయితండా తదితర గ్రామాలను సందర్శించిన ఆయన మొక్కల పెంపకం పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలతో పాటు, బ్యాగ్ ఫిల్లింగ్ చేపట్టిన విధానాన్ని ఈజీఎస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీడీ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాబోయే హరితహారాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మోహన్‌రావు, సర్పంచులు మామిడాల లింగారెడ్డి, బొట్టు మానస, సోనియా, ఎంపీటీసీలు జీడి ఝాన్సీ, తాళ్లపల్లి ఉమ సమ్మయ్య, భూక్య యాదగిరి, పంచాయతీ కార్యదర్శులు ఎన్నకూస రాజు, బాపూనాయక్, శశిధర్‌రెడ్డి, జీడి ఆనందం, టీపీ చేరాలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులు వీరే..

నేడు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం

జనగామ టౌన్, జనవరి 25 : గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా యంత్రాంగం ఉత్తమ అధికారులతో పాటు ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసింది. ఉత్తమ జిల్లా అధికారులుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వి.రామ్మూర్తి, ప్లానింగ్ అధికారి ఇస్మాయిల్, కోఆపరేటివ్ అధికారి రాజేందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ చంద్రశేఖర్, సర్వే ల్యాండ్స్ ఏడీ కొండల్‌రెడ్డి, డీడబ్ల్యూవో జయంతి, డీపీఆర్‌వో రాజేంద్రప్రసాద్, డీఎంవో నరేంద్రరెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి కృష్ణప్రియ, డీఏవో వినోద్‌కుమార్, జడ్పీ సీఈవో వి.జ్యోత్స్న, డైరీ అభివృద్ధి డీడీ డి.ధనరాజ్, ఎల్‌డీవో ఎం.శ్రీధర్ ఎన్నికయ్యారు. వీరితో పాటు కలెక్టరేట్ కార్యాలయం నుంచి బి.సతీశ్, కె.విధేయ, బాలు మహేంద్ర, కె.అబ్బసాయిలు, ఎండీ.ఖాజామోహినుద్దీన్, యు.వెంకటేశ్, జిల్లా రెవెన్యూ శాఖ నుంచి బచ్చన్నపేట తహసీల్దార్ సీహెచ్.విశాలక్ష్మి, స్టేషన్‌ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, పాలకుర్తి తహసీల్దార్ శరత్‌చంద్ర, జనగామ నాయబ్ తహసీల్దార్ జగన్, జిల్లా రెవెన్యూ కింది స్థాయి సిబ్బంది కృపాకర్‌రెడ్డి, యాకస్వామి, ఈశ్వరయ్య, ఎం.శ్రీనివాస్, వి.వెంకటేశ్వర్లు, రాజయ్యలు ఎంపికయ్యారు.

పోలీసు శాఖ నుంచి జఫర్‌గఢ్, కొడకండ్ల, జనగామ ఎస్సైలు మహేందర్, శ్రావణ్‌కుమార్, శ్వేతతో పాటు జిల్లాలోని హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, శిరాజుద్దీన్‌ఫరీద్, నర్సిరెడ్డి, తిరుపతి, కరుణాకర్, ప్రవీణ్, కరుణాకర్, ధనుంజయ్, శ్రీనివాస్, కె.భిక్షపతి, సీహెచ్.సురేశ్, టి.కిశోర్, ఎం.బాబు, సిహెచ్.అశోక్, ఈ.నరేశ్, ఎస్‌డీ.నజీముద్దీన్, బి.సునీల్, ఎం.ప్రభాకర్, కె.సోమేశ్వర్, రవీందర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిసార్ పాషా, అశోక్, నరేశ్, ఇంటలిజెన్స్ నుంచి జి.మల్లేశం, డి.శ్రీనివాస్‌రావు, ఎం.సురేశ్ ఎంపికయ్యారు. మిగతా శాఖల్లో కింది స్థాయి విభాగాల్లో ఖాజా మోహినుద్దీన్, బి.సీతారాంనాయుడు, సృజన, స్వప్న, అనిల్‌కుమార్, సతీశ్, రవి, బాలకృష్ణ, అనిత, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, వి.కాంత్, కె.దినేశ్‌కుమార్, రవీందర్‌గౌడ్, అశోక్‌కుమార్, రత్నాకుమారి, స్టెల్లా, కె.నరేశ్, బి.నర్సింహులు, ఆర్.వెంకటేశ్వర్లు, డాక్టర్ అనిత, జ్యోతి, మంజుల, ఎం.హుస్సేన్, ఎ.రణధీర్, చిరంజీవి, ఈవీఎస్.రెడ్డి, శ్రీనివాస్, మహమూద్, కోటయ్య, రాజేందర్, క్రాంతికుమార్, అంజనేయరాజు, రవీందర్, జగదీశ్వర్, కుమార్, వి.ఎలేశా, ఆర్.వీరస్వామి, రజిని, అమర్‌నాథ్, ఎండీ.ఇబ్రహీం, చన్నపురెడ్డి, ఉషారాణి, కృష్ణ, హుస్సేన్, సంధ్య, సుప్రజ, భాస్కర్, హరికృష్ణ, పి.కృష్ణ, భాస్కర్, బి.శ్రీనివాసులు, ఎ.బాలకృష్ణ, వి.రేణుక ఎన్నికయ్యారు. వీరు గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.

రూ.500 కోసం వృద్ధురాలి హత్య

అప్పు ఇచ్చి అడుగుతోందని దారుణం

మహబూబాబాద్ జిల్లా లైన్‌తండాలో ఘటన



ఈరమ్మ (ఫైల్)

గూడూరు, జనవరి 25 : అవసరానికి తన సమీప బంధువుకు ఓ వృద్ధురాలు అప్పు ఇచ్చింది. తిరిగి ఆ డబ్బులు ఇవ్వాలని అడగడంతో కోపోద్రిక్తుడై ఆమెను హత్య చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కోబల్‌తండా శివారు మూడుగుడిసెల లైన్‌తండాలో బుధవారం రాత్రి చోటుచేసుకొంది. గురువారం ఎస్సై రాణాప్రతాప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మూడు గుడిసెల లైన్‌తండాకు చెందిన తేజావత్ ఈరమ్మ(58) అదే తండాలోని వరుసకు బావ అయిన తేజావత్ స్వామికి వారం రోజుల క్రితం రూ.500 అప్పుగా ఇచ్చింది. తిరిగి ఆ డబ్బులు ఇవ్వమని గత మూడు రోజులుగా అడుగుతూ.. దుర్భాషలాడింది. దీంతో కోపోద్రిక్తుడైన స్వామి బుధవారం రాత్రి ఈరమ్మ నిద్రిస్తుండగా, ఆమె ఇంటికి వెళ్లి ఇంటికి వెళ్లి గొంతు నులిమి హత్య చేసినట్లు ఎస్సై వివరించారు. మృతురాలి కుమారుడు తేజావత్ వీరన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మినీ స్టేడియంలో గణతంత్ర వేడుకలు

పతాకావిష్కరణలో పాల్గొననున్న కలెక్టర్

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



మినీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ టౌన్, జనవరి 25 : గణతంత్ర దినోత్సవ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచలో గల మినీ స్టేడియంలో వేడుకలు జరుపాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ధర్మకంచలోని మినీ స్టేడియంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ శివలింగయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జిల్లా ప్రగతిపై సందేశం ఇస్తారు. తదుపరి వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారికి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. గతేడాది గణతంత్ర వేడుకలను కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించగా.. స్థలాభావ పరిస్థితుల దృష్ట్యా ఈసారి మినీ స్టేడియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున దగ్గరుండి చేయించగా.. అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ పరిశీలించి తగు సూచనలు చేశారు. మరోవైపు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఐడీపీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రైతుబంధు నిధులు విడుదల చేయాలి

- రుణమాఫీపై సర్కార్ స్పష్టత ఇవ్వాలి
- సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల మంజూరుకు కృషి చేస్తా..
- మండల సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మండల సభలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్, జనవరి 25: రైతుబంధు డబ్బులను ఈ నెలాఖరు లోగా విడుదల చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం యాసంగి సీజన్ ముమ్మరంగా కొనసాగుతున్నందున పంటల పెట్టుబడుల కోసం రైతులను ఆదుకునేందుకు అందించే ఆర్థిక సాయాన్ని 5 ఎకరాల నిబంధనలు లేకుండా వారి ఖాతాల్లో జమ చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జఫర్‌గఢ్ మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ రడపాక సుదర్శన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీహరి హాజరై మాట్లాడుతూ ప్రధానంగా రైతు పథకాలైన రూ.2లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. పథకాల అమలు, అభివృద్ధిలో ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సహకరిస్తామని ఉద్ఘాటించారు. సర్పంచ్‌లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లుల నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. ఫిబ్రవరి 1 నుంచి పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన వచ్చినా.. బకాయిలపై ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు చేపట్టిన పనులపై ఈ నెల 31 వరకు తగు వివరాలతో రికార్డులు చేయాలని సంబంధిత అధికారులను కడియం ఆదేశించారు. కాగా, జనవరి 31 వరకు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రైతుబంధు నిధులను జమ చేయాలని మండల సభలో ఎమ్మెల్యే కడియం ప్రతిపాదించగా.. సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా తీర్మానించారు.

అధికారుల పనితీరుపై అసహనం

మండల సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయా ప్రధాన శాఖలపై సమీక్షించారు. కార్యాలయ మరమ్మతులపై అలసత్వం, ఆయా అంశాలపై సభలో నివేదించడం, అడిగిన ప్రశ్నలపై సరైన సమాధానం, సమగ్ర వివరాలు లేకపోవడంతో ఎంపీడీవో శ్రీధర్‌స్వామితో పాటు పలు శాఖల అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరైన ఆయా శాఖల అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధిలో ఆయా శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని కడియం శ్రీహరి అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసినప్పుడే ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అధికారిక సమీక్షలు, సమావేశాలకు వచ్చే సందర్భంలో మొక్కుబడిగా కాకుండా ఆయా అంశాలపై సమగ్ర వివరాలతో రావాలన్నారు.

సర్పంచ్‌లకు కడియం సన్మానం

సర్పంచ్‌లకు కడియం సన్మానం

కాగా, ఈ నెల 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండడంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లను వేదికపై పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. అదేవిధంగా ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా మండల సభకు ముఖ్య అతిథిగా హాజరైన కడియం శ్రీహరిని గజమాలతో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కనకయ్య, సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, తహసీల్దార్ అంజనేయులు, ఎంపీటీసీలు, అధికారులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

మేడారంలో ఆర్‌డబ్ల్యూఎస్ పనులు ముమ్మరం

రూ.14.5 కోట్లతో భక్తులకు సౌకర్యాల కల్పన



మేడారంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసిన జీఎల్‌ఆర్

మేడారం, జనవరి 25 : తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు తరలివచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్లు మంజూరు చేసింది. పనుల బాధ్యతలను వివిధ శాఖలకు కేటాయించింది. ఇందులో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ రూ.14.5 కోట్లతో ఆయా పనులు చేపడుతోంది. 5,600 తాత్కాలిక మరుగుదొడ్లు, జంపన్నవాగులోని ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో పూడికతీత, 42 మోటార్ల ద్వారా 14 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏడు వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా చేసే పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ ట్యాంక్‌ల నుంచి పార్కింగ్, అడవి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 555 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌కు నీటిని సరఫరా చేసి భక్తులకు అందించనున్నారు. 15కిలోమీటర్ల పైప్‌లైన్లు, 400 చేతిపంపుల మరమ్మతులు చేపడుతున్నారు. బోర్ బావుల ఎయిర్ ప్రెసింగ్, ఊట బావుల ప్రెసింగ్, తాత్కాలిక మరుగుదొడ్లకు నీటి సరఫరా, క్యూలైన్ల వద్ద తాగునీటి సౌకర్యం, నీటి శుద్ధీకరణ పనులు సాగుతున్నాయి. అలాగే మేడారంలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వసతిని ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టే పనులను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. దీంతో పనులు వేగవంతమై 70 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

రోజుకు 50 లక్షల లీటర్ల తాగునీరు

మేడారం మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు

మిగతా 8వ పేజీలో...

రాజ్యాంగమే దేశ రక్షణకు కవచం

రాజ్యాంగ సద్భావన ర్యాలీలో ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి


అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న హరికోట్ల రవి

వడ్డెపల్లి, జనవరి 25 : భారత రాజ్యాంగమే దేశ రక్షణకు కవచమని వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి అన్నారు. ఓటర్ల దినోత్సవం, గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ మాల మహానాడు, వివిధ కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ ములుగురోడ్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వరకు భారత రాజ్యాంగ సద్భావన ర్యాలీని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ర్యాలీలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భారతదేశం అత్యంత పెద్ద ప్రజాస్వామిక దేశమని అన్నారు. మన దేశానికి రాజ్యాంగం అవసరమైనప్పుడు దేశంలో మేధావిగా ఉన్న అంబేద్కర్ రాజ్యాంగాన్ని తన భుజస్కంధాలపై వేసుకొని ప్రజాస్వామ్యదేశానికి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. రాజ్యాంగంలో అన్ని వర్గాలకు, వ్యవస్థలకు సమానమైన హక్కులు కల్పించారని అన్నారు. గ్రామగ్రామాన రాజ్యాంగంలోని గొప్పతనాన్ని వివరించాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా పొందిన ఓటు హక్కును ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సమాజంలోని పౌరులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, పొలిట్ బ్యూరో చైర్మన్ అసోదా భాస్కర్, రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రాములు, బీసీ నాయకులు క్రాంతి, ప్రవీణ్, వెంకన్న, మాల మహానాడు నేతలు అంకేశ్వరపు రాంచందర్‌రావు, బొల్లం రామ్‌కుమార్, నాగరాజు, ఉదయ్, పొనుగంటి లక్ష్మీనారాయణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

కేయూ హాస్టల్స్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రజిత

కేయూ క్యాంపస్, జనవరి 25: కాకతీయ యూనివర్సిటీ హాస్టల్స్ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రజితను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశా రు. ఇటీవల ఏసీబీ దాడుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏఆర్ క్రిష్ణయ్య వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో పనిచేసేవారు. క్రిష్ణయ్య సస్పెన్షన్ తర్వాత వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో ఏఆర్, సూపరింటెండెంట్‌ను నియమించకపోవడంతో పరిపాలనపరమైన ఇబ్బందులు తలెత్తాయి. దీంతో వర్సిటీ పరిపాలన అధికారులు రజితను నియమించారు.

కేయూకు ఐసెట్-24 నిర్వహణ

జూన్ 4, 5 తేదీల్లో పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 25: 2024-25 ఏడాదికిగాను రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే టీఎస్ఐసెట్-24 నిర్వహణ బాధ్యతలు ఈ దఫా మళ్లీ కేయూకే దక్కింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రవేశ పరీక్షలకు షెడ్యూల్‌ను ప్రకటించారు. షెడ్యూల్‌లో భాగంగా ఈ దఫా వరంగల్ కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్-24 నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి వరుసగా పదిసార్లు కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 4, 5 తేదీల్లో టీఎస్ఐసెట్-24 ప్రవేశ పరీక్షల నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి షెడ్యూల్‌ను ప్రకటించింది. కాకతీయ యూనివర్సిటీకే టీఎస్ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై వర్సిటీ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

భర్త వేధింపులు తాళలేక
భార్య ఆత్మహత్య

చిత్రహింసలు పెట్టి చంపారని మృతురాలి బంధువుల ఆందోళన



ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు



స్వరూప (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 25: భర్త వేధింపులు తాళలేక భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని జల్లి తండాలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే తండాకు చెందిన జర్పుల ప్రవీణ్‌కు మగ్ధుంపురం తండాకు చెందిన భూక్య మల్లికాం బ- లాక దంపతుల కుమార్తె స్వరూప(40)తో 24 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కుమారుడు వంశీ, కుమార్తె చందనలున్నారు. కుమారుడు వంశీ 5 నెలల కిందట ప్రేమం వివాహం చేసుకున్నాడు. మృతురాలి భర్త ప్రవీణ్ ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి భార్య స్వరూపను తిడుతూ, కొడుతూ వేధించేవాడు. ఈ విషయంలో స్వరూప గతంలో రెండుసార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నం చేసింది. అలాగే కుమారుడు వంశీ ప్రేమ వివాహం విషయంలోనూ భార్య స్వరూపను తరుచూ వేధింపులకు గురిచేస్తున్నాడు. కాగా, బుధవారం సాయంత్రం భర్త ప్రవీణ్ భార్య స్వరూపతో మళ్లీ గొడవ జరిగింది. నానాబూతులు తిడుతూ స్వరూపు తిట్టి కొట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపంతో స్వరూప పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే చుట్టుపక్కలవారు గమనించి చికిత్స నిమిత్తం గమనించి చికిత్స కోసం నర్సంపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి మల్లికాంబ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నెక్కొండ సీఐ హతీరాంనాయక్, ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కాగా జర్పుల ప్రవీణ్ తన కూతురు స్వరూపను నిత్యం మద్యం సేవించి వచ్చి వేధింపులకు గురి చేసేవాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అంతేకాకుండా కూతురు శరీరంపై గాయాలున్నాయని అతడిపై చర్యలు తీసుకోవాలని ప్రవీణ్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఎలాంటి గొడవలు కాకుండా స్వరూప అంత్యక్రియలను నిర్వహించారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

వనదేవతలకు కొనసాగుతున్న మొక్కులు

మేడారం, జనవరి 25 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఫిబ్రవరి 21 నుంచి మహాజాతర జరగనుండగా వివిధ ప్రాంతాల నుంచి గురువారం భారీ సంఖ్యలో తరలి వచ్చి ముందస్తుగా తల్లులను దర్శించుకున్నారు. సుమారు లక్షల మంది వనదేవతలకు మొక్కులు సమర్పించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించుకున్నారు. చల్లగా చూడాలని తల్లులను మొక్కుకున్నారు.

ప్రేమ విఫలమై మనస్థాపంతో
యువకుడి ఆత్మహత్య

మృతుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాసి

హనుమకొండ క్రైం, జనవరి 25: క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతూ చెక్క శ్రీకాంత్ (26) అనే యువకుడు బుధవారం రాత్రి మృతి చెందాడు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ కొంతకాలంగా హనుమకొండ పోచమ్మకుంటలో ఉంటూ ములుగురోడ్డులోని అజరా ఆస్పత్రిలో ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్లుగా హనుమకొండలో ఉంటున్న ఓ యువతితో ప్రేమలోపడ్డాడు. సదరు యువతి శ్రీకాంత్ ప్రేమను నిరాకరించి ఇటీవల మరో వ్యక్తితో పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెందిన శ్రీకాంత్.. ఈ నెల 20న భద్రకాళి చెరువు సమీపంలోని వెళ్లి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడి వారు చూసి పోలీసులకు ఫోన్ చేయడంతో 108 సహాయంతో అజరా ఆస్పత్రిలో నాలుగు రోజులుగా చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు చెక్క సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. తన తమ్ముడి మృతికి ప్రేమేకారణమని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

దాడి కేసులో మూడేళ్ల జైలు శిక్ష

నర్సింహులపేట, జనవరి 25: దాడి కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సరిత తీర్పును గురవారం వెల్లడించారు. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. జయపురంలో 2015లో ఇంటి ప్రహరీ విషయంలో నేలకుర్తి మోహన్‌రెడ్డి, నేలకుర్తి బుచ్చిరెడ్డి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో మోహన్‌రెడ్డి పారతో దాడి చేసిన ఘటనలో బుచ్చిరెడ్డి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపి కోర్టుకు సమర్పించిన సాక్షాధారాలను విచారించిన జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సరిత నిందితుడు నేలకుర్తి మోహన్‌రెడ్డికి రూ.2వేలు జరిమానా విధిస్తూ, మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించినట్లు తెలిపారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన సీఐ సత్యనారాయణ, ఎస్సై సతీష్, కోర్టు కానిస్టేబుల్ డీఎస్పీ వెంకటేశ్వరబాబు అభినందించారు.

దేవాలయాల్లో చోరీకి పాల్పడిన
నిందితుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న దేవుడి వాహన విగ్రహాలతో డీఎస్పీ వెంకటేశ్వరబాబు, పోలీసు అధికారులు

తొర్రూరు, జనవరి 25 : తొర్రూరు డివిజన్ పరిధిలోని మరిపెడ, తొర్రూరు, దంతాలపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరబాబు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. వారు మహబూబాబాద్ జిల్లాలో దంతాలపల్లి మండలం పెద్దముప్పారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, తొర్రూరు మండలం మాటేడు వేణుగోపాలస్వామి, అమ్మాపురం సీతారామచంద్రస్వామి, మరిపెడ మండలం గుండెపుడిలోని సీతారామస్వామి ఆలయాల్లో దేవుడి విగ్రహాలను ఊరేగింపు సమయంలో చేపట్టే ఉత్సవవిగ్రహాలు, గరుడవాహనం, అశ్వ వాహనం, ఇత్తడి గొడుగు, దివిటీలు దొంగిలించేవారు. నకిరేకల్ మండల కేంద్రానికి చెందిన చింతల పుల్లారావు అనే పాత ఇనుప సామాను కొనుగోలు వ్యక్తికి విక్రయిస్తారు.

మరిపెడ మండలంలోని ఎల్లంపేట శివారు జమ్మికుంట తండాలో ట్రాన్స్‌ఫారం, కాపర్ వైరు కూడా దొంగిలించి విక్రయించగా గుండెపుడి ఆలయ ఆవరణలో దొంగతనం చేసినపుడు పోలీసులు విచారణ చేపట్టగా మహిళలు కూడా ఈ దొంగతనం చేసినట్లు గుర్తించి డివిజన్ పరిధిలోని సీఐల ఆదేశాల మేరకు పోలీసులు టీమ్‌గా ఏర్పడి విచారణ చేపట్టారు. నిందితులు ఉపయోగించిన ఆటో సీసీ కెమెరాలో కనిపించడంతో గురువారం తొర్రూరు ఎస్సై సతీష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా నిందితులు ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజు, ఎడ్ల వెంకటమ్మ, ఎడ్ల పున్నమ్మ, నాగిళ్ల దుర్గ, గోపగాని రాజమ్మ ఆరుగురు చింతల పుల్లారావుతో కలిసి వెళ్తుండడంతో సమాచారం మేరకు పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరి వద్ద నుంచి రూ.60 వేల నగదు, రెండు క్వింటాల ఇత్తడి విగ్రహాలు, కాపర్‌వైరు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులకు డీఎస్పీ రివార్డులు అందజేశారు. సీఐ లు కరుణాసాగర్, సత్యనారాయణ, ఎస్సైలు సతీష్, తహేర్‌బాబా, జగదీష్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

కమలాపూర్, జనవరి 25: కమలాపూర్ మండలంలోని భీంపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న జె.విజయ అనే ఉపాధ్యాయురాలిని గురువారం విధుల నుంచి సస్పెండ్ చేశామని మండల విద్యాధికారి రాంకిషన్‌రాజు తెలిపారు. విధుల పట్ల ఉపాధ్యాయురాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థులకు సరిగా పాఠాలు చెప్పడంలేదని, విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, పాఠశాలలోని తోటి ఉపాధ్యాయులను, ఎస్‌ఎంసీ చైర్మన్‌ను, సర్పంచ్‌ను, గ్రామస్తులను అసభ్య పదజాలంతో దూషించిందన్నారు. దీంతో ఉపాధ్యాయురాలిపై టీపీటీఎఫ్ నాయకులు, ఎస్‌ఎంసీ చైర్మన్, గ్రామ సర్పంచ్, పీటీఏలు ఫిర్యాదు చేయడంతో జిల్లా విద్యాధికారి ఎమ్డీ అబ్దుల్‌హై విచారణకు ఆదేశించారని ఆయన తెలిపారు. డీఈవో ఆదేశాల మేరకు ఈనెల 22న పాఠశాలలో విచారణ జరిపామని ఆయన తెలిపారు. విచారణ నివేదికను జిల్లా విద్యాధికారికి సమర్పించడంతో నివేదిక ఆధారంగా ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు.

పుష్‌పుల్ రైలు ఢీకొని విధుల్లో ఉన్న కీమెన్ మృతి



మృతుడు కీమెన్ రాజు



సంఘటనకు ముందు కీమెన్ రాజు

గిర్మాజీపేట, జనవరి 25 : విధి నిర్వహణలో భాగంగా రైల్వేట్రాక్ చెక్ చేస్తున్న రైల్వే కీమెన్ వల్లెపు రాజు (38) పుష్‌పుల్ రైలు ఢీకొని దుర్మరణం చెందిన విషాద ఘటన గురువారం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ విలేఖరులకు తెలిపిన ప్రకారం ఈ సంఘటనా వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ రైల్వేస్టేషన్‌లోని సీనియర్ సెక్షన్ ఇంజనీయర్ 3వ యూనిట్‌లో పనిచేస్తున్న కీమెన్ వల్లెపు రాజు రోజు వారి డ్యూటీలో భాగంగా గురువారం ఉదయం డ్యూటీ ఎక్కాడు. విధి నిర్వహణలో భాగంగా రాజు మూడో లైన్ ట్రాక్ చెక్ చేస్తు చింతల్‌పల్లి వైపు ట్రాక్‌పై బయలుదేరాడు. ఉదయం గంటల ప్రాంతంలో పంచనగిరి రైల్వేగేటు సమీపంలో వరంగల్ నుంచి డోర్నకల్ వెళ్తున్న పుష్‌పుల్ రైలు వెనుక నుంచి ఢీ కొట్టింది. పొగమంచు కారణంగా రైలు రాకను ఆలస్యంగా గుర్తించిన రాజు, రైలు హారన్ విని పక్కకు వెళ్లేందుకు కంకర కుప్ప ఎక్కగా జారడంతో రైలు ఢీ కొట్టింది. అదే సమయంలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్న రైల్వే పోర్టర్ కుమారస్వామి మృతుడు తన సోదరుడు రాజుగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చాడు. ఎస్సై ఎం.అయిలయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ తెలిపారు. తండ్రి స్వచ్ఛంద పదవి విరమణ స్థానంలో రాజు కీమెన్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, కూతురు, తల్లిదండ్రులు ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

- మాజీ డీజీపీకి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో అత్యంత కీలకమైన తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు కొత్త సారథి వచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వరుసగా ప్రశ్నప్రతాల లీకేజీతో అప్రదిష్టపాలైన సంస్థకు.. రిటైర్డ్ పోలీస్ బాస్ అధిపతిగా నియమితులయ్యారు. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా.. కమిషన్‌ను ప్రక్షాళన చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి అడుగువేసింది. టీఎస్‌పీఎస్సీ పగ్గాలను మాజీ డీజీపీ ముదిరెడ్డి మహేందర్‌రెడ్డికి అప్పగించింది. సభ్యులుగా రిటైర్డ్ ఐఏఎస్ అనితారాజేంద్ర, ఇండియన్ పోస్టల్ సర్వీస్ రిటైర్డ్ అధికారి అమీర్ ఉల్లాఖాన్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ నర్రి యాదయ్య, విద్యుత్తు శాఖకు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యరబడి రామ్మోహన్ రావు, కాంగ్రెస్ నాయకురాలు పాల్వాయి రజనీకుమారిని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు గవర్నర్ తమిళిసై గురువారం ఆమోదం తెలిపారు. ఆ వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా, చైర్మన్, సభ్యులు

పదవీ బాధ్యతలు చేపట్టిన తేదీ నుంచి ఆరేళ్లపాటు లేదా 62 ఏళ్ల వయసు నిండేలోపు పదవుల్లో ఉంటారు. ఈ నిబంధనల్లో ఏది ముందు వర్తిస్తే అది అమలవుతుంది. మరోవైపు ఈ ఆరుగురిలో ఓసీ, బీసీ సామాజికవర్గాలకు చెందినవారు ఇద్దరు ఉండగా, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించారు. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌తో కలిపి మొత్తం 11 మందిని నియమించవచ్చు. ప్రస్తుతం చేపట్టినవి పోగా.. ఇంకా ఐదుగురిని నియమించే అవకాశం ఉంది. వీటిపైనా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



భుజాలపై చాలా పెద్ద బాధ్యత

బీఆర్‌ఎస్ హయాంలో టీఎస్‌పీఎస్సీ తీవ్ర విమర్శలకు గురైంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం సంస్థ పేరును మసకబార్చింది. నిరుద్యోగుల ఆత్మహత్యల నేపథ్యంలో కమిషన్ దోషిగా నిలవాల్సి వచ్చింది. దీంతో అప్పటి చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు రాజీనామా చేయాలంటూ విపక్ష నేతలు, ఓయూ విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. అయినా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారిని కొనసాగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. జనార్దనరెడ్డి, నలుగురు సభ్యులు వైదొలగారు. మిగతా ఇద్దరిలో ఒకరు ఇటీవల రాజీనామాను గవర్నర్‌కు పంపారు. మరొకరు ఇంకా వైదొలగలేదు. కాగా, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రకటించారు. కొత్త కమిషన్ ఏర్పాటయ్యాక ఏడాది లోపు 2 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. టీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా, పకడ్బందీగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డితో పాటు సభ్యులపై చాలా పెద్ద బాధ్యత ఉంది.

వ్యవసాయ కుటుంబం..

మహేందర్‌రెడ్డిది ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కిష్టాపురం గ్రామం. వ్యవసాయ కుటుంబానికి చెందిన నారాయణరెడ్డి, అచ్చమ్మలకు 1962 డిసెంబరు 3న జన్మించారు. నల్లగొండ జిల్లా సర్వేల్ గురుకులంలో ప్రాథమిక, కూసుమంచిలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. నాగార్జున సాగర్ గురుకుల కళాశాలలో ఇంటర్, వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ (ఆర్ఈసీ) నుంచి 1984లో బీటెక్ సివిల్ పూర్తి చేశారు. ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్ చదివారు. 1986లో మొదటి ప్రయత్నంలోనే సివిల్స్ సాధించారు. విశాఖపట్నం, గోదావరిఖని, గుంటూరులో ఏఎస్పీగా, బెల్లంపల్లి అడిషనల్ ఎస్పీగా, నిజామాబాద్, కర్నూలు జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఈస్ట్ జోన్ డీసీపీ, జాతీయ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్, డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలందించారు. 2003-07 మధ్య సైబరాబాద్ కమిషనర్‌గా కొనసాగారు. గ్రేహౌండ్స్, ఇంటిలిజెన్స్ చీఫ్‌గా చేసిన మహేందర్‌రెడ్డి 2014-17 నడుమ హైదరాబాద్ సీపీగా, 2017-22లో డీజీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. పోలీసింగ్‌లో టెక్నాలజీకి పెద్దపీట వేశారు.

ఉత్తమ అధికారిగా..



రిటైర్డ్ ఐఏఎస్ అనితారాజేంద్ర ఓయూలో ఎంఏ, ఎల్‌ఎల్‌ఎం చదివారు. 1963 ఫిబ్రవరి 4న జన్మించారు. 1998లో సివిల్స్ సాధించారు. 2011-12లో మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా, 2012లో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా, 2013-14లో ఏపీఐడీసీ వీసీ అండ్ ఎండీగా, 2015లో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా, 2015-18లో హోం శాఖ కార్యదర్శిగా, 2018-20లో బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా, 2020-22లో పశు సంవర్ధక శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండుసార్లు అవార్డు పొందారు. అనితా గౌడ వర్గానికి చెందినవారు.

విద్యుత్తు శాఖ నుంచి..



విద్యుత్తు శాఖలోని జల విద్యుత్తు విభాగంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు యరబడి రామ్మోహన్‌రావు. ఎరుకల (ఎస్టీ) సామాజిక వర్గానికి చెందినవారు. 1963లో జన్మించిన ఆయన 1984లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బీఈ చదివారు.

విద్యావంతుల ఇంటి నుంచి..



హైదరాబాద్ జూబ్లీ హిల్స్ ఫిల్మ్‌నగర్‌కు చెందిన 58 ఏళ్ల అమీర్ ఉల్లాఖాన్‌ది వీరిది విద్యావంతుల కుటుంబం. 1983 బ్యాచ్ ఇండియన్ పోస్టల్ సర్వీసు అధికారి. 1995లో వీఆర్‌ఎస్ తీసుకున్నారు. తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌డీపీ)లో పనిచేశారు. ఉర్దూ వర్సిటీ, ఐఎస్‌బీ, నల్సార్, ఎంసీహెచ్‌ఆర్‌డీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. విద్య, ఆర్థిక రంగాలపై కథనాలు రాశారు.

సీనియర్ ప్రొఫెసర్..



యాదయ్య 1964 ఫిబ్రవరి 10న జన్మించారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఎలక్ట్రానిక్స్ సీనియర్ ప్రొఫెసర్. 1988లో బీఈ, 1991లో ఎంటెక్, 2000లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2008-12 వరకు జేఎన్‌టీయూలోని ఈఈఈ విభాగం హెచ్‌వోడీగా, 2013-14లో సీఈహెచ్ విభాగం వైస్ ప్రిన్సిపల్‌గా, 2014-15లో ప్రిన్సిపల్‌గా, 2015-19 వరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఎంసెట్ కన్వీనర్‌గా పనిచేశారు. ఈయన కురుమ వర్గానికి చెందినవారు.

గ్రూప్-1 కొలువు వదిలి..



దళిత వర్గానికి చెందిన రజనీ 1972లో జన్మించారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎల్‌ఎల్‌బీ, బీఈడీ చదివారు. 2000 సంవత్సరంలో గ్రూప్-1 సాధించారు. 2004 వరకు ఖైరతాబాద్ సర్కిల్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఉమ్మడి ఏపీ సీఎంగా ఉండగా.. ఆయన ప్రోత్సాహంతో టీడీపీలో చేరారు. ఆ ఏడాది సూర్యాపేటలో, 2014లో తుంగతుర్తి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023 అక్టోబరు 18న రేవంత్‌రెడ్డి పిలుపుతో కాంగ్రెస్‌లో చేరారు.



ఇక.. వేగంగా
పోస్టుల భర్తీ!

- టీఎస్‌పీఎస్సీకి కొత్త రూపుతో ఉద్యోగార్థుల్లో ఆశాభావం
- ప్రభుత్వ చొరవపై హర్షం

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)ను గాడిన పెట్టే అంశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ పట్ల ఉద్యోగార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చైర్మన్, సభ్యులను నియమించి టీఎస్‌పీఎస్సీకి కొత్త రూపు తీసుకురావడంతో ఇక ఉద్యోగాల భర్తీనే తరువాయి అని ఆశగా ఎదురు చూస్తున్నారు. నిజానికి, గత ప్రభుత్వ హయాంలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2 సహా వివిధ పోస్టులకు పరీక్షలు జరిగాయి. కానీ, పేపర్ లీకేజీలు, పరీక్షకు హాజరైన అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోకపోవడం తదితర కారణాల వల్ల ఆయా పరీక్షలు రద్దు అయ్యాయి. దీంతో టీఎస్‌పీఎస్సీ అప్రతిష్ఠ మూటకట్టుకోగా ఉద్యోగార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై నిరుద్యోగులకు హామీనిచ్చింది. అధికారం చేపట్టిన వెంటనే బోర్డును ప్రక్షాళన చేసి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై దృష్టి సారించింది. చైర్మన్, సభ్యుల ఎంపిక కోసం అనుభవజ్ఞులు, మేధావులతో ఓ కమిషన్ ఏర్పాటు చేసింది. అలాగే, వివిధ రాష్ట్రాల్లోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పనితీరు అధ్యయనానికి ఐఏఎస్ అధికారులను రెండు బృందాలుగా కేరళ, ఢిల్లీ పంపింది. ఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహణపై ప్రత్యేకంగా అధ్యయనం చేయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా యూపీఎస్సీ అధికారులతో స్వయంగా మాట్లాడారు. మొత్తంగా రాజకీయ ప్రమేయం లేకుండా చైర్మన్, సభ్యులను ఎంపిక చేసి జాబితాను గవర్నర్‌కు పంపగా వెంటనే ఆమోదం లభించింది. దీంతో కమిషన్ పూర్తి స్థాయిలో ఏర్పాటైంది. దీంతో ఉద్యోగాల భర్తీ ఇక పారదర్శకంగా జరుగుతుందని ఉద్యోగార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నియామకాల్లో సామాజిక న్యాయం

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల నియామకం విషయంలో దాదాపు అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం దక్కింది. చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి ఓపెన్ కేటగిరి, రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అనితా రామచంద్రన్, కుర్మ కులానికి చెందిన నర్రి యాదయ్య, ఎస్టీ (ఎరుకుల) సామాజిక వర్గానికి చెందిన రామ్మోహన్ రావు, ఎస్సీ (మాదిగ) సామాజిక వర్గానికి చెందిన గ్రూప్-1 అధికారిగా పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న పాల్వాయి రజని, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో పనిచేసిన అమీరుల్లాఖాన్ (ముస్లిం మైనార్టీ కోటాలో) సభ్యులుగా నియమితులయ్యారు. వీరంతా ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేశారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న బాల్‌రెడ్డి

బచ్చన్నపేట, జనవరి 25: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గత పది రోజులుగా కొనసాగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. జిల్లాలోని పలు మండలాలకు చెందిన 20 టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి జనగామ టీం, ద్వితీయ బహుమతి లక్ష్మాపూర్ జట్టు గెలుచుకున్నాయి. విజేతలకు స్పాన్సర్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు నూకల బాల్‌రెడ్డి, మహేష్‌రెడ్డి బహుమతులు అందించారు. ప్రతిభ చూపిన వారికి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, సిరీస్‌లను అందజేశారు. క్రీడా స్ఫూర్తిని చాటిన ఆయా జట్ల క్రీడాకారులను వారు అభినందించారు. ఈకార్యక్రమంలో ఇమ్మడి లోకేష్, రాజిరెడ్డి, నవీన్, మధుసూదన్‌రెడ్డి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



కోమల్ల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

రఘునాథపల్లి, జనవరి 25 : పంటలపై అధిక మోతాదులో రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందని దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యుడు అబ్బయ్య అన్నారు. మండలంలోని కోమల్ల గ్రామంలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బయోచార్ కార్యక్రమంలో భాగంగా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని కోరుతూ రైతులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్య మాట్లాడుతూ రసాయనిక ఎరువులను ఎక్కువ స్థాయిలో వాడడం వలన భూసారం దెబ్బతిని పంట దిగుబడులు తగ్గే అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, మమత, రైతులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు అందరు కృషి చేయాలి

▸▸ కుష్ఠువ్యాధి నివారణ రాష్ట్ర టీం డీపీఎంవో వెంకటేశ్వరచారి



కుష్ఠువ్యాధి నివారణ బృందంతో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు

దేవరుప్పుల, జనవరి 25: కుష్ఠువ్యాధి రహిత సమాజంకోసం అందరూ కృషి చేయాలని కుష్ఠువ్యాధి నివారణ రాష్ట్ర టీం డీపీఎంవో వెంకటేశ్వరచారి అన్నారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. అనంతరం ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సిబ్బందితో ఆయన మాట్లాడుతూ 2027 వరకు కుష్ఠువ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి ఎండీటీ చికిత్స అందించినచో పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టీం ప్రతినిధుల బృందం సభ్యులు సురేందర్, దేవిక, పరుశరాములు, మండల వైద్యాధికారి రవితేజ, నోడల్ పర్సన్ భాగ్యమ్మ, సంపూర్ణ, సిబ్బంది రామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల చెకుముకి టాలెంట్ టెస్టు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 25: స్థానిక శివునిపల్లి పట్టణ హైస్కూల్‌లో ఈ నెల 27న మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్టు చెకుముకి మండల కన్వీనర్ డి.సత్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో టెస్టులో ప్రథములుగా నిలిచిన 8, 9, 10 తరగతులకు చెందిన ముగ్గురు విద్యార్థుల చొప్పున మండల స్థాయి పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉదయం 10.30 గంటలకు టెస్టు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848820367 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

జనగామ కల్చరల్, జనవరి 25: జిల్లాలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఓటరు దినోత్సవంలో శ్రీ గాయత్రి విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. గురువారం జనగామ జిల్లాకేంద్రంలో నిర్వహించిన పాటల పోటీల్లో శ్రీగాయత్రి కళాశాలకు చెందిన విద్యార్థిని కూకట్ల సింధు 'ఫ్యూచర్ ఓటర్స్' అనే అంశంపై పాటల పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య సింధును అభినందిస్తూ ప్రశంసాపత్రం అందించారు. కాగా, ప్రతిభ కనబరిచిన సింధును కళాశాల ప్రిన్సిపాల్ నోముల శ్రీనివాస్, యాజమాన్యం టి.సంజీవరెడ్డి, ఎన్.నర్సింహారావు, అధ్యాపకులు అభినందించారు.

● బచ్చన్నపేట: మండలంలోని పాఠశాలల్లో ఓటరు దినోత్సవం సందర్భంగా రెవెన్యూ అధికారులు విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్యం ప్రజలకు ఇచ్చిన బలమైన ఆయుధం ఓటు అని, సమాజంలో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ముగ్గులు తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. తహసీల్దార్ విశాలాక్షి, నాయబ్ తహసీల్దార్ ఖాసీం, ఎంపీడీవో రఘురామకృష్ణ, ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

● కొడకండ్ల: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ అంజయ్య, డిప్యూటీ తహసీల్దార్ చంద్రమోహన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు కోసం దరఖాస్తు చేసకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● దేవరుప్పుల: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా దేవరుప్పులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాపోలు ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. అదేవిధంగా ఎంపీపీ బస్వ సావిత్రి, తహసీల్దార్ హసీన్ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు దేవరుప్పులలో ర్యాలీ, మానవహారం నిర్వహించగా వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో ఆర్ఐ రాజు, తోటకూరి పాండు కృష్ణ, అధ్యాపకులు భాస్కర్, అరుణాకర్, శశిధర్, రాధిక, చైతన్య, హరితకుమారి, రహిమున్నీసా, భవానీ, ఉదయ్‌కుమార్, శ్రీనివాస్, సుమ, ఆదర్శ కుమారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి: 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి రాజీవ్ చౌరస్తా వరకు టీఎస్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశం మాట్లాడుతూ ఒక్క ఓటు ద్వారా ప్రజలకు మంచి చేసే నాయకుడిని ఎన్నుకోవచ్చున్నారు.కార్యక్రమంలో ఎస్సై లింగారెడ్డి, ఆర్ఐలు శరత్‌చంద్ర, రాకేష్, ఎన్నికలడీటీ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

● రఘునాథపల్లి: మండలకేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాయం నుంచి బస్‌స్టేషన్ వరకు ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల వరలక్ష్మి, తహసీల్దార్ పి.యుగేందర్, ఎంపీడీవో ఎండి.హషీం, ఎస్ఐ సిహెచ్.రఘుపతి, ఎంపీవోవెంకటేశ్వర్లు,రమేష్, సారయ్యపాల్గొన్నారు.

● జఫర్‌గఢ్:జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని స్థానిక రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జఫర్‌గఢ్‌లో విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వివిధ ప్రధాన వీధుల గుండా ప్లకార్డులు చేబూని ఓటు హక్కు ప్రాధాన్యత - వినియోగంపై వివరిస్తూ నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ అంజనేయులు మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన వయోజనులంతా విధిగా ఓటు హక్కును పొందాలన్నారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ దుర్గాప్రసాద్, ఎంఆర్ఐ అనిల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయరాజు, హెచ్ఎం గణేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, జీపీ ఉద్యోగ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధం లాంటిదని, దానిని ఓటర్లు తప్పక వినియోగించుకోవాలని ఆర్డీవో వాసం రామ్మూర్తి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ హైస్కూల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం హైస్కూల్‌లో సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల నోడల్ అధికారి కొమురయ్య హెచ్ఎంలు షరీస్, సదామోహన్, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్, విద్యాజ్యోతి కళాశాల విద్యార్థులతో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో జూనియర్ కళాశాలప్రిన్సిపాల్ రాజిరెడ్డి, హైస్కూల్ హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, విద్యాజ్యోతి కళాశాల ప్రిన్సిపాల్‌ఫాదర్ థామస్ కిరణ్, కమలాకర్, లావణ్య, లలిత, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఓటరు దినోత్సవం

● లింగాలఘణపురం : మండలంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను గురువారం అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించారు. ప్రధానంగా రెవెన్యూ అధికారులు ఓటు ప్రాధాన్యతను ప్రతీ గ్రామంలో బూత్ స్థాయిలో చైతన్యపరచాల్సి ఉండగా అధికారులు ఎక్కడా కూడా పట్టించుకున్న దాఖలాలు కన్పించకపోవడం గమనార్హం. కేవలం లింగాలఘణపురం మండల కేంద్రంలో స్థానిక జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు హెడ్మాస్టర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. అక్కడ కూడా ఆర్ఐ స్థాయి అధికారి చుట్టపు చూపుగా రావడం మినహా ఓటు హక్కు ప్రాధాన్యతను, ఓటు నమోదు ఆవశ్యకతను వివరించే దిక్కులేకుండా పోవడంపై ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



పట్టణంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సింధు



స్టేషన్‌ఘన్‌పూర్ హైస్కూల్‌లో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఆర్డీవో



పాలకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



దేవరుప్పులలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు



జఫర్‌గడ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థులకు రక్త పరీక్షలు

నర్మెట, జనవరి 25: ఎనిమియా ముక్త భారత్ ప్రోగ్రాం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో గురువారం నర్మెట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఆనంద్, డాక్టర్ సౌజన్య, ఫార్మాసిస్టు వెలంగిణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



నర్మెటలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

మాజీ ఎంపీపీ కుటుంబానికి కడియం పరామర్శ

జఫర్‌గడ్, జనవరి 25 : మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన మాజీ ఎంపీపీ, టీఆర్ఎస్ నేత గబ్బెట బుచ్చయ్య తండ్రి పోషయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం పరామర్శించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఓబులాపూర్‌కు వెళ్లి పోషయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుమారుడైన టీఆర్ఎస్ నేత బుచ్చయ్యతో పాటు బాధిత కుటుంబీకులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. నివాళులర్పించిన నేతల్లో ఎంపీపీ సుదర్శన్, జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కనకయ్య, సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, స్థానిక సర్పంచ్ నీరజారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, మాజీ ఎంపీపీ గాదెపాక అయోధ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

మెడికల్ కాలేజీకి పార్థివదేహం అప్పగింత

జనగామ కల్చరల్, జనవరి 25 : లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించారు. పట్టణంలోని రాజేశ్వరి అనాథ ఆశ్రమంలో ఆశ్రయం పొందిన తొట్టి లక్ష్మమ్మ అనారోగ్యంతో గురువారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందింది. ఆశ్రమ నిర్వాహకులు అందించిన సమాచారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో అనాథ శవాన్ని ది ఫాదర్ కొలంబో మెడికల్ సైన్సెస్ వరంగల్‌కు అప్పగించినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నజియా ఫాదర్ అరుణ్ మాట్లాడుతూ శరీర దానం గురించి సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కామిని శ్రీనివాస్‌బాబు, ఏనుగు నర్సిరెడ్డి, శ్రీరామ్ శ్రీనివాస్, భైరు వెంకటేష్, వర్రీ వేణుగోపాల్‌రెడ్డి, దాసరి సుమన్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ శవాన్ని ఆస్పత్రికి అప్పగిస్తున్న లయన్స్ ప్రతినిధులు

రంగస్థలంపైనే రారాజులం..

▸▸ చింతచెట్ల కింద ప్రదర్శనలు ఇచ్చినం

▸▸ చిందు కళను గుర్తించడం సంతోషంగా ఉంది

▸▸ పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన గడ్డం సమ్మయ్య

జనగామ టౌన్, జనవరి 25: చింతచెట్ల కింద, దొరల గడీలు, బొడ్రాయి కూడళ్ల వద్ద ప్రదర్శనలెన్నో ఇచ్చిన తాము రంగస్థలంపై రారాజులుగా, నిజ జీవితంలో దుర్భరులుగా బతుకుతున్నామని పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన గడ్డం సమ్మయ్య అన్నారు. మారుతున్న కాలంలో కనుమరుగవుతున్న తమ కళను కేంద్ర ప్రభుత్వం గుర్తించడం సంతోషంగా ఉందని చెమ్మగిల్లిన కళ్లతో చెప్పారు. దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లికి చెందిన సమ్మయ్యకు గురువారం రాత్రి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. ఆ సమయంలో జనగామలో రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతితో ఉన్న సమ్మయ్య తన ఆనందాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి నుంచి వారసత్వంగా యక్షగాన కళను నమ్ముకుని జీవిస్తున్నామన్నారు. పూర్వ కాలం నుంచి ఈ కళను నమ్ముకుని ఎంతో మంది చిందు కళాకారులు జీవిస్తున్నారని, ఇప్పుడీ కళ అంతరించిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ్‌ముఖ్ గడీల ముందు తాను ఎన్నో ప్రదర్శనలు ఇచ్చానని గుర్తు చేశారు. ప్రభుత్వం క్లాసికల్ కళాకారులకు ఇచ్చే ప్రాధాన్యం తమకు ఇవ్వడం లేదన్నారు. ఈ తరుణంలో తమ కళను గుర్తించి తనను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయడంపై కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానించిన రిటైర్డ్ కర్నల్ భిక్షపతి..

కేంద్రం పద్మశ్రీ అవార్డు ప్రకటించిన వెంటనే తనవెంట ఉన్న గడ్డం సమ్మయ్యను రిటైర్డ్ కర్నల్ మాచర్ల భిక్షపతి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సమ్మయ్యతో కేక్ కట్ చేయించారు. భిక్షపతి మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదొడుకులు ఎదురైనా తన కళనే నమ్ముకుని ముందుకు సాగుతున్న జనగామ జిల్లాకు చెందిన సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు దక్కడం గర్వంగా ఉందన్నారు. సన్మానించిన వారిలో మాచర్ల స్వరూప, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ జైన రమేశ్, సమ్మయ్య పాఠశాల గురువు వంగాల దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గడ్డం సమ్మయ్య

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పల్లా..

పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన గడ్డం సమ్మయ్యకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దేశ వ్యాప్తంగా 34 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రకటించగా అందులో జనగామ జిల్లా నుంచి సమ్మయ్య ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఆయనను శుక్రవారం నేరుగా కలువనున్నట్లు పల్లా ప్రకటించారు.

సమ్మయ్యకు అవార్డు రావడం ఆనందంగా ఉంది

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, జనవరి 25: దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు దేశ స్థాయిలో పద్మశ్రీ అవార్డు రావడం ఆనందంగా ఉందని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ రంగాల్లో విశిష్టమైన వ్యక్తిగత సేవలే అతనికి జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టాయని, ఇతరులకు సమ్మయ్య ఆదర్శంగా నిలిచారన్నారు. అంతరించిపోతున్న కళలను కాపాడుతూ ప్రజలకు ఉపయోగపడే తమ రంగంలో సేవలందించిన వారిని కేంద్రం సత్కరించడం అభినందనీయమన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 25 : స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ఉన్నందున రైతులు సహకరించాలని మార్కెట్ కార్యదర్శి జున్ను భాస్కర్ తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం, 27న జిన్నింగ్ మిల్లుల వారి విన్నపం మేరకు, 28న ఆదివారం వారాంతపు సెలవు ఉన్నందున మార్కెట్‌కు సెలవులు ప్రకటించామన్నారు. 29న తిరిగి మార్కెట్ యథావిధిగా కొనసాగుతుందని కార్యదర్శి భాస్కర్ పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

చిలుపూర్, జనవరి 25 : ద్విచక్ర వాహనాలు ఎదురె దురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని మల్కాపూర్ సమీపంలో గల కొమ్ముగుట్ట క్రాస్‌వద్ద గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన వంగ మల్లేష్ తన సమీప బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యం నిమిత్తం నర్మెటమండలంలోని గండిరామారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగు పయనంలో స్వగ్రామానికి వెళ్తుండగా, అదే మండలంలోని సోడషపల్లికి చెందిన నేరెళ్ల స్వామి తన ద్విచక్ర వాహనంపై మద్దెలగూడెం మీదుగా లింగంపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రెండు బైక్ లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గుండ్లసాగర్‌కు చెందిన వంగ మల్లేష్ కాలు విరగడంతో పాటు, తలకు తీవ్ర గాయాలు కాగా, నేరెళ్ల స్వామికి స్వల్ప గాయా లయ్యాయి. స్థానికులు బాధితులిద్దరినీ చికిత్స నిమిత్తం 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చిలుపూర్ ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజేఐటీలో ఉద్యోగ నైపుణ్యతా శిబిరం



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థినులు

జనగామ కల్చరల్, జనవరి 25 : జనగామ జిల్లా యశ్వంతాపురంలోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల(సీజేఐటీ)లో ఉద్యోగ నైపుణ్యతా శిబిరం నిర్వహించారు. గురువారం సెంటమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతకు సంబంధించి ఉద్యోగ నైపుణ్యత పెంపొందించే దిశగా 10 రోజులుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళా విద్యార్థినులను సాంకేతిక, ఆర్థిక, సామాజిక పరిజ్ఞానంలో ముందుంచాలనేదే సంస్థ ఉద్దేశ్యం. ఈ శిక్షణా తరగతులకు కళాశాల చివరి సంవత్సరం చదువుతున్న 123 మంది విద్యార్థినులు పాల్గొనగా 91 మందికి అర్హత లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. వారిలో 50 మంది విద్యార్థినులు 500 గంటల ఉచిత సాఫ్ట్‌వేర్ శిక్షణకు ఎంపికయ్యారు. అర్హత సాధించిన విద్యార్థులకు ప్రాజెక్టు మేనేజర్ ఇయ్యమేల్, కార్పొరేట్ ట్రైనర్ సంజయ్‌కుమార్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి పాల్గొని నిర్వాహకులను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి అర్హత సాధించిన విద్యార్థినులను అభినందించారు.

మల్లన్న ఉత్సవాలకు రూ.10వేల విరాళం

▸▸ అందజేసిన వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 25: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన యాద వులు నిర్వహించే మల్లన్న ఉత్సవాలకు వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాదేవి దంపతులు గురువారం రూ.10వేలు విరాళం అందజేశారు. యాదవుల కులదైవం అయిన మల్లన్న దేవుడి ఉత్సవాలను గ్రామంలో ప్రతీ యేటా నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మల్లన్న గుడి వద్ద యాదవులంతా కలిసి పట్నాలు వేయించి వేడుకలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వైస్ ఎంపీపీ దంపతులు ముం దుకువచ్చి విరాళం అందజేయడం పట్ల యాదవులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు తాటికొండ రమేష్, దాసరి మొండయ్య, బర్మా మల్లేశం, దాసరి కొమురయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లి జాతర వేలం పాటల ఆదాయం రూ.16 లక్షలు

చిలుపూర్, జనవరి 25 : మండలంలోని లింగంపల్లిలో సమ్మక్క, సారలమ్మ వనదేవతల జాతర వేలం పాటల ఆదాయం రూ.16 లక్షలు సమకూరిందని ఈవో చిందం వంశీ తెలిపారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట వనదేవతల జాతరలో వివిధ దుకాణ సముదాయముల ఏర్పాటుకు సంబంధించి సర్పంచ్ ఏదునూరి రవిందర్, ఎంపీటీసీ కంకటి రవిందర్ గ్రామస్తుల సమక్షంలో, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి పర్యవేక్షణలో వేలం పాటలు నిర్వహించారు. అంతకుముందు వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేలం పాటల్లో అమ్మవారి పెద్దతీర్థం, కోళ్ల విక్రయానికి రూ.8.31 లక్షల ఆదాయం రాగా, బంగారం(బెల్లం), మొక్కుబడి వెంట్రుకలు, కొబ్బరికాయల విక్రయం, కొబ్బరికాయల చిట్టీల విక్రయం, సైకిల్, స్కూటర్ స్టాండ్, పుట్నాలు, పేలాల విక్రయానికి రూ7.69 లక్షల ఆదాయం సమకూరింది. ఈ దఫా నిర్వహించిన వేలం పాటల్లో అత్యధికంగా రూ.16 లక్షల ఆదాయం సమకూరడం శుభపరిణామమన్నారు. నూతనంగా ఏర్పాటయ్యే జాతర కమిటీతో పాటు, గ్రామస్తులందరి సహకారంతో జాతరను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంకటి రాజన్న, కండ్లకోలు బాలరాజు, రావుపల్లి వెంకటేశ్వర్లు, గంగుల సంపత్‌రెడ్డి, శ్రీనివాస్, రచ్చ రవిందర్, కొయ్యడ సత్యం, మోతె శ్రీను, దేవాదాయ శాఖ అధికారులు రాజేందర్ రెడ్డి, కుర్రెంల మోహన్, కె.రాములు, రొయ్యల నర్సింహులు, అపరాదపు రాజు, రాచకొండ రాజు, చాతెల్లి రజాక్, మంద సిద్దులు, సందోజు రవీంద్రాచారి, గొడుగు రవి తదితరులు పాల్గొన్నారు.



వనదేవతలకు పూజలు చేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

మేడారంలో ఆర్‌డబ్ల్యూఎస్ పనులు ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

రోజులు జరగనుంది. సుమారు కోటిన్నర మంది భక్తులు రానున్నట్లు అధికారులు అంచనాలు వేశారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేసి సౌకర్యాలు కల్పిస్తున్నారు. భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పనులు చేపడుతోంది. ఊరట్టం వద్ద 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, ఊరట్టం క్రాస్ వద్ద 4 లక్షల లీటర్లు, పగిడిద్దరాజు షెడ్ వద్ద 2 లక్షల లీటర్లు, హరిత హోటల్ వద్ద లక్ష లీటర్లు, గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ ట్యాంకులు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద 2 లక్షల లీటర్ల ట్యాంకు, గద్దెల ఎదుట అతిథి భవనాల వద్ద 50వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటికి భగీరథ, జంపన్నవాగు ఊట బావుల నుంచి మోటార్ ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు. క్యూలైన్లు, జంపన్నవాగు నుంచి గద్దెల వరకు రహదారి మీదుగా, మేడారం, రెడ్డిగూడెం, కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి పరిసర గ్రామాల్లో భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బీవోటీలకు నీటిని పంపిణీ చేయనున్నారు. రోజుకు 50 లక్షల లీటర్లకు పైగా తాగునీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.